E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం: 9959812941-9949356387



PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :12 | శనివారం 13 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-


## 21 సీట్లతో రాజీపడలేదు

### ఏపీ కోసం మేం త్యాగం చేశాం!



2 లో

న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి ఏర్పాటులో జనసేన 21 సీట్లతో రాజీపడలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిందని స్పష్టం చేశారు. ప్రజలు తమ త్యాగాన్ని గుర్తించి 100 శాతం విజయాన్ని అందించారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సమిష్టిగా కృషి చేస్తోందని పవన్ తెలిపారు.

# స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు

## ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం

న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ చేరవేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో విద్యాశాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు అందిస్తున్న వర్క్ బుక్స్ 2026-27 విద్యా సంవత్సరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైతం కొత్తగా వర్క్ బుక్స్ పంపిణీ చేయనున్నారు. అభ్యాసన సామర్థ్యాలు పెరగడానికి వర్క్ బుక్స్ ఉపయోగపడుతాయని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లోని 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు సుమారు 12 లక్షల మంది వరకు ఉంటారు. అయితే వర్క్ బుక్స్ ఈ నెలాఖరు లేదా జులై మొదటివారంలో అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



2 లో

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



2 లో

## మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న

# రైలుపై రాళ్ల దాడి

### సురక్షితంగా బయటపడిన ఆర్ఎస్ఎస్ చీఫ్



2 లో

# 'రప్పారప్పా' అంటే చూస్తూ ఊరుకోము

## నారా లోకేష్ మాస్ వార్నింగ్!

న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి జిల్లా దామినీడు వేదికగా శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ముఖ్య అథిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. రప్పారప్పా అంటే తాము చూస్తూ ఊరుకోమని, రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూ పోతుందని ప్రతిపక్షంకు వార్నింగ్ ఇచ్చారు.

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో భూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు.

గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు.



2 లో

# రెండేళ్లలో ఏపీకి కొత్త దిశ

- రెండేళ్ల పాలనకు మైలురాయి
- ఏపీ బ్రాండ్ ఇమేజ్‌కు బూస్ట్
- భారీ పెట్టుబడుల ప్రవాహం
- రూ.23 లక్షల కోట్ల ఎంఓయూలు
- ఉద్యోగాలపై భారీ ఆశలు
- డీఎస్సీ, పోలీస్ నియామకాలకు ఊపు
- సూపర్-6 హామీల అమలు
- పెన్షన్లు రూ.4 వేలకు పెంపు
- దీపం-2తో ఉచిత సిలిండర్లు
- తల్లికి వందనం.. ఖాతాల్లో నగదు
- రైతులకు సుఖీభవ అండ
- ఆడబిడ్డ నిధి ఇంకా పెండింగ్
- నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపులు
- అమరావతికి మళ్లీ మంచి రోజులు
- అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లుగా



న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంది. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత.. నారా చంద్రబాబు నాయుడు ఏపీ సీఎంగా ప్రమాణం చేయగా.. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ మంత్రిగా కీలక బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. మరి కూటమి రెండేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారింది..? ఏయే విషయాల్లో కూటమి ప్రభుత్వం సానుకూల ఫలితాలు సాధించింది.. ఏయే హామీలు నెరవేర్చలేకపోయారు, ఇంకా ఏమేం చేయాల్సి ఉందనేది చూద్దాం.

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన అతిపెద్ద మార్పు ఏపీ బ్రాండ్ వాల్యూ పెరగడం. రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా మద్దతు ఉంటుందని పారిశ్రామికవేత్తల్లో గట్టి నమ్మకం కలిగించడంలో కూటమి సర్కారు విజయం సాధించింది. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన స్పీడ్ ఆఫ్ బిజినెస్ విధానం చక్కటి ఫలితాలను ఇచ్చింది.

ప్రభుత్వం నుంచి భరోసా లభించడం, కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉండటంతో.. ఏపీకి గత రెండేళ్లలో భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఈ రెండేళ్లలోనే దాదాపు 800 కంపెనీలు ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబర్చాయి. సుమారు రూ. 23 లక్షల కోట్ల విలువైన ఎంఓయూలు కుదిరాయని ప్రభుత్వం తెలిపింది. ఈ రెండేళ్ల కాలంలో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో నాలుగో వంతు వాటా ఏపీకి దక్కడం విశేషం.

మిగతాది 2 లో..

## కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది: పవన్ కల్యాణ్



2 లో

న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం): కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తిరుపతిలోని దామినీడులో నిర్వహించిన కూటమి రెండేళ్ల పాలన సభలో ఆయన మాట్లాడుతూ.. 2024లో ప్రజలు భయాన్ని, అహంకారాన్ని తిరస్కరించారని అన్నారు.

## రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్

### పరిస్థితులే నన్ను ఈ స్థాయికి తెచ్చాయంటూ సంచలన పోస్ట్



2 లో

ప్రజలు మౌనంగా కనిపించినా అవసరం వచ్చినప్పుడు చరిత్రను మార్చగలరని నిరూపించారన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ విజయం కేవలం బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలది కాదని ప్రజల విజయం అని అన్నారు. ఈ కూటమి అధికారాన్ని పంచుకోవడానికి ఏర్పడింది కాకుండా బాధ్యతను పంచుకోవడానికి ఏర్పడిందని అన్నారు.

## ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ..
## పిటిషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ ఆవేదన

మొదటి పేజీ తరువాయి



పిటిషన్ ను రిజెక్ట్ చేయడం కేవలం తన వ్యక్తిగత ఓటమి మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకే పెద్ద దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘంలో ఉన్న అధికారులు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడులకు లొంగిపోయారని తాను మొదటి నుంచీ చెప్తూనే ఉన్నానన్నారు. నామినేషన్ ను రిజెక్ట్ చేయడంపై తమ పార్టీ ప్రతినిధులు ఈసీని సంప్రదిస్తే 48 గంటలపాటు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని వాపోయారు. ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె.. సుప్రీంకోర్టు తీర్పుపై మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనన్నారు. రిటర్నింగ్ అధికారి ఏకపక్ష నిర్ణయం ఇప్పుడు ప్రజలందరికీ అర్థమైందని పేర్కొన్నారు. కాగా.. ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరికి నిరసనగా, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయం దేశ రాజధాని న్యూఢిల్లీలో భారీ ఎత్తున 'సత్యాగ్రహ' నిరసన చేపట్టాయి. ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగి ప్రతిపక్షాల గొంతు నొక్కేలా ఈసీ వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది: పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి



ప్రజలు మౌనంగా కనిపించినా అవసరం వచ్చినప్పుడు చరిత్రను మార్చగలరని నిరూపించారన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ విజయం కేవలం బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలది కాదని ప్రజల విజయం అని అన్నారు. ఈ కూటమి అధికారాన్ని పంచుకోవడానికి ఏర్పడింది కాకుండా బాధ్యతను పంచుకోవడానికి ఏర్పడిందని అన్నారు.

కూటమిలో జనసేన 21 సీట్లు సర్దిపెట్టుకున్న సమయలో చాలా మంది విమర్శించారని చెప్పారు. కానీ తాము ఏపీ భవిష్యత్ కోసమే జనసేనను 21సీట్లకు పరిమితం చేశామని అన్నారు. వందశాతం స్ట్రైక్ రేట్ సాధించామని చెప్పారు. వ్యవస్థ బలహీనపడినప్పుడే ప్రాంతీయత ముందుకు వస్తుందని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం కులాల పరిమితులు దాటాలని, అందరూ భారతీయత వైపు వెళ్లాలని వ్యాఖ్యానించారు. గ్రామ సమస్యలకు పరిష్కారం గ్రామంలోనే వెతకాలని సూచించారు. ప్రజల జీవితాల్లో సమస్యలను ప్రజల్లోనే వెతకాలని అన్నారు. అందుకే గ్రామసభలను కేవలం అధికారిక సమావేశంలా కాకుండా గ్రామ ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువు కావాలన్నారు.

## రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్
### పరిస్థితులే నన్ను ఈ స్థాయికి తెచ్చాయంటూ సంచలన పోస్ట్



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** తమిళనాడు రాజకీయాల్లో రోజుకో కొత్త మార్పు చోటుచేసుకుంటోంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికపై ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ ప్రతిష్టాత్మక స్థానంలో విజయ్ టీవీకే పార్టీ తరపున నటుడు రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా కొరియోగ్రాఫర్, నటుడు రాఘవ లారెన్స్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోందిరాఘవ లారెన్స్ తన పోస్ట్‌లో స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ నిజాయితీగా, నా బాధ్యతను సక్రమంగా నిర్వహించాలనే అనుకున్నాను. కానీ, ఒకరోజు నేను రాజకీయాల్లోకి వస్తానని కలలో కూడా ఊహించలేదు. నాకు రాజకీయాల్లోకి రావాలనే కోరిక గానీ, రాజకీయం ద్వారా డబ్బు సంపాదించాలనే ఆశ గానీ, ఏదైనా పెద్ద పదవిని దక్కించుకోవాలనే లాలస గానీ ఎప్పుడూ లేదు.

నేను నమ్మిన వ్యక్తి, నాకు అత్యంత సన్నిహితుడైన ఒకరు రాజకీయాల్లోకి వస్తే.. వారికి మద్దతుగా నిలిచి, నేను వ్యక్తిగతంగా చేస్తున్న సేవా కార్యక్రమాల కంటే పెద్ద ఎత్తున ప్రజలకు సేవ చేయాలని మాత్రమే అనుకున్నాను. కానీ, నేటి పరిస్థితులు నన్ను రాజకీయాల్లోకి అడుగుపెట్టేలా చేశాయి" అని పేర్కొన్నారు. రాజకీయాలపై తన మనసులోని మాటను పంచుకుంటూ.. " రాజకీయంపై నా అభిప్రాయం ఏంటి? అది నా జీవితంలోకి ఎలా వచ్చింది? రాజకీయాలపై నా తల్లి ఆలోచనలు ఏంటి? అలాగే నా ప్రయాణాన్ని మార్చిన కొన్ని ముఖ్యమైన, ఆసక్తికరమైన సంఘటనలు ఏంటనే విషయాలను ఎలాంటి దాపరికం లేకుండా, పూర్తి నిజాయితీతో వీడియోలో పంచుకున్నాను" అని లారెన్స్ వెల్లడించారు. తన రాజకీయ ప్రయాణంపై అభిమానులకు, ప్రజలకు లారెన్స్ ఒక కీలకమైన విజ్ఞప్తి చేశారు.

ఎటువంటి స్వార్థం, ప్రతిఫలం ఆశించకుండా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆయన కోరారు. తన వీడియో చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్ల రూపంలో తెలియజేయాలని అన్నారు. ఒకవేళ ప్రజలు వద్దని చెబితే, తాను ఎంత మాత్రం రాజకీయాల్లోకి ప్రవేశించనని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటూనే సమాజానికి తాను చేస్తున్న నిస్వార్థ సేవలను ఎప్పటిలాగే కొనసాగిస్తానని చెప్పారు. అలా కాకుండా ప్రజలంతా రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటే మాత్రం.. అందరి ఆశీస్సులతో, తాను అనుకున్న వ్యక్తులతో కలిసి ఈ సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నానని లారెన్స్ తన మనసులోని మాటను బయటపెట్టారు. ఈ ప్రకటనతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.

## మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి
## సురక్షితంగా బయటపడిన ఆర్ఎస్ఎస్ చీఫ్



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై గుర్తుతెలియని దుండగులు రాళ్లు రువ్విన ఘటన ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర కలకలం రేపింది. ఫిరోజాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ రాళ్ల దాడిలో మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న ఏసీ ఫస్ట్ క్లాస్ బోగీ (ఈ1) కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అయితే, ఈ ప్రమాదంలో మోహన్ భాగవత్‌తో పాటు ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారుల కథనం మేరకు కాన్పూర్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రాత్రి 7.15 గంటల సమయంలో ఫిరోజాబాద్‌లోని రసూల్‌పూర్, దక్షిణ్ పోలీస్ స్టేషన్ సరిహద్దు ప్రాంత గుండా వెళ్తోంది. ఈ క్రమంలోనే కొందరు దుండగులు ఒక్కసారిగా రైలుపైకి రాళ్లు విసిరారు. ఓ పెద్ద రాయి మోహన్ భాగవత్ కూర్చున్న సీటు వైపు ఉన్న కిటికీకి బలంగా తగిలింది. దీంతో కిటికీ బయటి వైపు ఉన్న గ్లాస్ పూర్తిగా పగిలిపోయింది. ఆ సమయంలో యూపీ పంచాయతీ రాజ్ మంత్రి భూపేంద్ర చౌదరి కూడా అదే బోగీలో ప్రయాణిస్తున్నట్లుగా సమాచారం.

అప్రమత్తమైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్..

అయితే, ఘటన జరిగిన వెంటనే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఫ), గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఆగ్రా జోన్ ఏడీజీ ఎస్కే భగవత్, ఫిరోజాబాద్ ఎస్ఎస్పీ ఆదిత్య లాంగే స్పాట్‌కు చేరుకున్నారు. రైలును కాసేపు తుండ్లా జంక్షన్ వద్ద నిలిపివేసి తనిఖీలు చేసిన అనంతరం ఢిల్లీకి సురక్షితంగా పంపేశారు. ఈ దాడికి సంబంధించి పోలీసులు ఇప్పటికే అనుమానితుడైన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రైల్వే ట్రాక్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, నిందితులను త్వరలోనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఎస్పీ ఆదిత్య లాంగే తెలిపారు.

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా
## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని కుట్రపూరితంగానే వ్యవహరించిదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మీనాక్షి నటరాజన్ ఎంతో నిబద్ధత, నిజాయితీ కలిగిన మహిళా నాయకురాలని అన్నారు. అలాంటి లీడర్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్‌లో తిరస్కరించడం అత్యంత అన్యాయమని అన్నారు. తనకు తెలిసినంత వరకు ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, కోర్టుల్లో ఎలాంటి వివాదాలు పెండింగ్‌లో లేవన్నారు. కనీసం ఆమె రాజకీయ జీవితంలో ఎలాంటి నిరసనలు, రాస్తారోకోలు, రాజకీయ గొడవల్లో పాల్గొన్నట్లుగా కూడా రికార్డుల్లో లేదన్నారు. ఆమె వ్యక్తిగత జీవితంలోనూ ఎలాంటి చట్టపరమైన సమస్యలు లేకుండా.. అంతటి క్లీన్ రికార్డ్ ఉన్న నేతను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈసీని ముందు పెట్టి రాజకీయం..

మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కావాలనే ఎన్నికల సంఘాన్ని వాడుకుని మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా చేసిందని జగ్గారెడ్డి విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ముందు నిలబెట్టి, ఓ రకంగా తాము అనుకున్న కుట్రలో విజయం సాధించిందని అన్నారు. ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఏముందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. విపక్ష నాయకులను టార్గెట్ చేయడానికి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.

## స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు..
### ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి




పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మండల కేంద్రాల నుంచి స్కూళ్లకు చేరుకోగా నోట్ బుక్స్ ఇంకా చేరలేదు. పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే పలు సూచనలు చేసింది.

రోజువారీ పర్యవేక్షణకు ఆదేశాలు..

పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ డీఈఓలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రవాణా, పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా రోజువారీ సరఫరా నివేదికలను ట్రాక్ చేయాలని స్పష్టం చేశారు. గతేడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యార్థులతో కలిసి బుక్స్ ట్రాలీలో తీసుకొస్తుండగా బోల్తా పడింది. అందులో విద్యార్థులు ఉండడాన్ని విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ ఏడాది అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, పాఠశాల ప్రారంభం నాటికే బుక్స్‌తోపాటు అన్ని మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వంద శాతం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## 'రప్పారప్పా' అంటే చూస్తూ ఊరుకోము..
## నారా లోకేష్ మాస్ వార్నింగ్!

మొదటి పేజీ తరువాయి



వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మాది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి. మనది కియా అయితే.. వారిది కిడ్నాప్' అని విమర్శించారు. అలాగే 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## రెండేళ్లలో ఏపీకి కొత్త దిశ

మొదటి పేజీ తరువాయి

అనకాపల్లిలో రూ. 1.35 లక్షల కోట్ల విలువైన ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టర్ స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగింది. రామాయపట్నంలో దాదాపు లక్ష కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. విశాఖలో లక్ష కోట్లకుపైగా విలువైన గూగుల్ డేటా సెంటర్‌కు సైతం శంకుస్థాపన జరిగింది. విజయనగరంలో రిలయన్స్ డేటా సెంటర్‌తోపాటు పుట్టపర్తిలో డిఫెన్స్ పరిశ్రమలు, కర్నూలులో డ్రోన్ సిటీ.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖపట్నానికి ఐటీ సంస్థలను తీసుకొచ్చేందుకు లోకేశ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఈ పరిశ్రమలన్నీ ఏర్పాటైతే, ఎంఓయూలు పెట్టుబడులుగా మారితే రాష్ట్రంలో 23 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఇక ప్రభుత్వ ఉద్యోగాల విషయానికి వస్తే.. డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వం.. 5757 కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీని సైతం వేగవంతం చేసింది.

2024 ఎన్నికల ముంగిట టీడీపీ సూపర్-6 పేరిట ప్రజలకు కీలక హామీలు ఇచ్చింది. అందులో భాగంగా సామాజిక ఫించన్లను రూ. 4 వేలకు పెంచారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఫించన్లను పంపిణీ చేస్తున్నారు. దీపం-2లో పథకంలో భాగంగా ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించడంతోపాటు.. తల్లికి వందనం పథకం కింద పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో ఏటా రూ. 15 వేలు చొప్పున జమ చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు.

అయితే 18-59 ఏళ్ల వయసున్న ప్రతి మహిళకు ప్రతి నెలా రూ. 1500 చొప్పున ఆర్థిక సాయం చేసేందుకు ఉద్దేశించిన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 చొప్పున నిరుద్యోగ భృతి ఇంకా అమలు కాలేదు. ఈ రెండు పథకాలు అమలు చేయడానికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం. ప్రభుత్వం దగ్గర సరిపడా నిధులు లేకపోవడంతో ఈ పథకాన్ని అమలు చేయలేకపోతున్నారు. అయితే బాబు మళ్లీ మాట తప్పారని ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ విమర్శలు చేస్తోంది.

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో గతంలో రోడ్ల మీద గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు ఇప్పుడు కాస్త రిలీఫ్‌గా ఫీలవుతున్నారు.

ఏపీ రాజధాని అమరావతికి కూటమి ప్రభుత్వంలో మళ్లీ మంచి రోజులు వచ్చాయి. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట అమరావతిని పట్టించుకోలేదు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతిలో నిర్మాణాలు తిరిగి ప్రారంభం అయ్యాయి. 2014 నాటి విభజన చట్టానికి సవరణలు చేసిన కేంద్రం.. ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించింది. దీంతో మూడు రాజధానుల ప్రతిపాదనకు చెక్ పెట్టినట్లయ్యింది. కేంద్రం కూడా అమరావతి అభివృద్ధి కోసం రూ. 15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. రాజధాని ప్రాంతంలో పనులు తిరిగి ప్రారంభం కావడంతో.. అమరావతి పరిధిలోని 29 గ్రామాలతోపాటు, చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ భూముల ధరలు పెరిగాయి.

కూటమి ప్రభుత్వం ఈగిల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తోంది. అన్నా క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఓవరాల్‌గా చెప్పాలంటే.. ఈ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే పడ్డాయి. చంద్రబాబు ముందు చూపు, కేంద్రం వద్ద పరపతి పెరగడం.. పవన్ కళ్యాణ్ ప్రజాకర్షణ, కూటమిలో విబేధాలు రాకుండా సమన్వయం చేసుకోవడం.. పెట్టుబడుల కోసం లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు ప్రజల్లో సానుకూలతను పెంచాయి. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా.. రాష్ట్రాన్ని సరైన ట్రాక్‌లోకి మళ్లించారనే నమ్మకాన్ని కలిగించారు.

అయితే సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిపోయిన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలను అమలు చేయడం.. అమరావతి నిర్మాణాన్ని ఓ కొలిక్కి తీసుకురావడం, పోలవరం నిర్మాణం పూర్తి చేయడం లాంటి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

## పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో పూర్తి స్వేచ్ఛ ఉంది
## సభకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్ క్లారిటీ



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెలంగాణలో ఎవరైనా రాజకీయాలు చేయవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ పర్యటనలు, శాంతిభద్రతలు మరియు మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జూన్ 2వ తేదీన తెలంగాణలో పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై స్పష్టత ఇచ్చారు. కేవలం శాంతి భద్రతలను పరిగణలోకి తీసుకుని మాత్రమే పోలీసులు ఆ నిర్ణయం తీసుకున్నారని, దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. "తెలంగాణలో పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆయనకు నచ్చినట్లు ఆయన రాజకీయాలు చేసుకోవచ్చు. ఇక్కడ ఎవరైనా పోటీ చేయడానికి అర్హులే" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

ఓట్ చోరీ అయిపోయింది.. ఇప్పుడు సీట్ చోరీ: బీజేపీపై ఫైర్

ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను బీజేపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై ఆయన మండిపడుతూ.. ఇది ముమ్మాటికీ కుట్రపూరిత చర్యేనని ఆరోపించారు. "మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. అయినప్పటికీ ఆమె నామినేషన్ను తిరస్కరించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. మధ్యప్రదేశ్‌లో రిటర్నింగ్ అధికారి పూర్తిగా తప్పుగా వ్యవహరించారు. దేశంలో మొదట ఓట్ల చోరీ జరిగింది.. ఇప్పుడు ఏకంగా సీట్ల చోరీకి పాల్పడుతున్నారు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 21 సీట్లతో రాజీపడలేదు.. ఏపీ కోసం మేం త్యాగం చేశాం!

మొదటి పేజీ తరువాయి

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడంలో అందరి సహకారం కీలక పాత్ర పోషించిందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని జనసేనాని చెప్పుకొచ్చారు.

వ్యవస్థలు బలహీనపడినప్పుడు కులం, ప్రాంతీయత వంటి అంశాలు ముందుకు వస్తాయని పవన్ కళ్యాణ్ అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఒక రాష్ట్రం కుల రాజకీయాలను అధిగమించాలని, మరో రాష్ట్రం ప్రాంతీయత భావనను దాటాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. 'ప్రజలు పార్టీలను మాత్రమే కాకుండా వ్యవస్థలను కూడా నమ్మాలి. నాయకులను కాకుండా సంస్థలను విశ్వసించాలి. వ్యక్తులను కాకుండా విలువలను ఆదర్శంగా తీసుకోవాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం, గ్రామ స్వరాజ్యం సాకారం అవుతాయి' అని పవన్ అన్నారు.



రాష్ట్రంలో 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని వివరించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంచేందుకు కృషి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిస్థితి దయనీయంగా ఉండేదని విమర్శించారు. కనీస అవసరాలకు కూడా నిధులు లేని పరిస్థితులు ఉండేవని, తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేశానని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేసిన పవన్.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకుండా భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తనకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రజలకు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామ సభలో సమస్యపై చర్చ"

## స్పందించిన ఐబీ ఏఈ వెంకటరమణ"

## ప్రారంభమైన పని"





వేంసూరు,జూన్12(తెలుగు గళం) న్యూస్: ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల లింగపాలెం గ్రామంలో ఇటీవల 99 రోజుల ప్రణాళిక అమలు తీరులో భాగంగా జరిగిన గ్రామ సభలో గ్రామ సర్పంచ్ ఎర్ర రమేష్,రైతులు ఎన్టీఆర్ కెనాల్ నుండి లింగపాలెం పెద్దచెరువు కి వెళ్లే తూము కాలువ పిచికాడతో అగుపించకుండా పూడుకు పోయిందని అధికారులకు విన్నవించారు.గ్రామ సభలో విన్నవించిన సమస్యపై ఐబీ ఏఈ వెంకటరమణ స్పందించారు.శుక్రవారం జేసీబీ యంత్ర సహాయంతో ఆ కాలువను జొన్నాదుల పుల్లారావు ఇంటి దగ్గర నుండి వైకుంఠదామం వరకు ఐబీ వారి సహకారంతో పిచ్చి కాడ పూడిక తీయించటం ప్రారంభం చేశారు.సర్పంచ్ ఎర్ర రమేష్ అట్టి పనిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

# సీఎంఆర్ఎఫ్ పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ఎమ్మెల్యే దృష్టి"

- సత్తుపల్లి లబ్ధిదారులకు సత్వర సహాయం అందించాలని సూచన"




సత్తుపల్లి,ఆర్ సి,జూన్12(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్న సీఎంఆర్ఎఫ్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై పెండింగ్ దరఖాస్తులు, రీ-వాలిడేషన్ ఫైళ్ల స్థితిగతులను సమీక్షించారు.

సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారుల దరఖాస్తులు అనవసర జాప్యానికి గురికాకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరయ్యే ఆర్థిక సాయం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సలు, అత్యవసర అవసరాల కోసం సీఎంఆర్ఎఫ్‌పై ఆధారపడుతున్న నేపథ్యంలో పెండింగ్ ఫైళ్లను ప్రాధాన్య క్రమంలో పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ సహాయం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు త్వరలోనే చెక్కులు అందే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.



# విశ్వశాంతి విద్యార్థులకు బాసర ట్రిపుల్ ఐటీలో స్థానం

## అఖిల్, అర్ఫాజ్ లకు ట్రిపుల్ ఐటీ లో సీట్లు


సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 12(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు కే. అఖిల్ మరియు ఎం.డి. అర్ఫాజ్ అలీ చదువుల తల్లి సరస్వతి దేవి కొలువుదీరిన బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.

శుక్రవారం విడుదలైన ప్రవేశ ఫలితాల్లో ఇద్దరూ సీట్లు కైవసం చేసుకున్నారు.

వీరిద్దరూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విశ్వశాంతి విద్యాలయంలోనే చదువుకున్నారు.ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో 574 మార్కులు సాధించాడు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ చదివిన అఖిల్, బీసీ వసతి గృహాల్లో నివసిస్తూ పదో తరగతి చదివిన విద్యార్థులలో జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిగా గుర్తింపు పొందాడు. ఈ సందర్భంగా ఇటీవల బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రూ.10 వేల నగదు పురస్కారం, జ్ఞాపికతో పాటు సన్మానం అందుకున్నాడు.

సత్తుపల్లి సత్తా చాటిన అర్ఫజ్ అలీ

అదేవిధంగా ఎం.డి. అర్ఫాజ్ అలీ పదో తరగతిలో 573 మార్కులు సాధించడంతో పాటు ఇటీవల ప్రకటించిన తెలంగాణ పాలీసెట్--2026 ఫలితాల్లో 120కి 120 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో సత్తుపల్లి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాడు. అర్ఫాజ్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, సత్తుపల్లి ఏసీపీ వసుంధరా యాదవ్ ఐపీఎస్, పోలీస్ బెటాలియన్ కమాండెంట్ అంజయ్య తదితర ప్రముఖులు సన్మానించారు.ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం పట్ల విశ్వశాంతి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి





పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

కాగా, విశ్వశాంతి విద్యాలయ విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాది బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తూ పాఠశాల ప్రతిభను చాటుతున్నారు.

# జలగం వెంగళరావు ఆశయసాధనకు కృషి చేయాలి"

## అమ్మపాలెంలో మాజీ ముఖ్యమంత్రికి ఘన నివాళి"



వేంసూరు,జూన్12(తెలుగు గళం) న్యూస్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం వేంసూరు మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో జలగం వెంగళరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల స్వామిరెడ్డి పాల్గొని జలగం వెంగళరావు సేవలను స్మరించుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి దూరదృష్టితో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన గొప్ప నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, సాగునీటి రంగం, విద్యా రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి నేటికీ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు.

జలగం వెంగళరావు ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో ముందుకు సాగాలని, ఆయన చూపిన మార్గం యువతకు స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో: అమ్మపాలెం సర్పంచ్ పెద్దగౌండ్ల ప్రసన్న ధర్మారావు, ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల కాంతారెడ్డి, బుడగనబోయిన పోయిన, బుడగనబోయిన సత్యం, లోకా కృష్ణ, రేసు వెంకటేశ్వరరావు, నందిగం రాంబాబు, బెజవాడ వెంకటేశ్వరరావు, బుడగనబోయిన పుల్లారావు, బుడగనబోయిన వెంకటేశ్వరరావుతో పాటు పలువురు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వర్షానికి చెరువుగా మారిన బంజర్ బైపాస్ రహదారి

## బొగ్గు లారీల రాకపోకలతో మరింత దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు, డ్రైనేజీ శుభ్రతకు స్థానికుల విజ్ఞప్తి"



పెనుబల్లి,జూన్ 12(తెలుగు గళం) న్యూస్ : ఖమ్మంజిల్లా పెనుబల్లి మండల పరిధిలోని వీఎం బంజర్ బైపాస్ రహదారి అధ్వాన్న పరిస్థితులకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై భారీగా నీరు నిల్వ ఉండటంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. సింగరేణి బొగ్గు లారీల నిరంతర రాకపోకలతో రహదారి మరింత దెబ్బతిని, గుంతలమయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

స్థానికుల కథనం ప్రకారం, రహదారి నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం, డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రోడ్డుపై అడుగుల మేర నీరు నిలిచిపోతోంది. నీటితో నిండిన గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.

ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ వందల సంఖ్యలో సింగరేణి బొగ్గు లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాల ఒత్తిడితో ఇప్పటికే దెబ్బతిన్న రహదారి మరింత కుంగిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని, అత్యవసర సేవల వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై నిలిచిన నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో పాటు ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని, డ్రైనేజీ కాలువలను శుభ్రపరచి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వీఎం బంజర్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకముందే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా జి. సాయికృష్ణారెడ్డి బాధ్యతల స్వీకారం"

## సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిషనర్"



కల్లూరు,జూన్12(తెలుగు గళం) న్యూస్ : కల్లూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా జి. సాయికృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పట్టణ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై సబ్‌కలెక్టర్‌తో చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు నూతన కమిషనర్ పేర్కొన్నట్లు తెలిసింది.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం.

నూతన కమిషనర్ బాధ్యతలు స్వీకరించడంతో మున్సిపాలిటీ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

# రాజమండ్రి రూరల్ కోటిపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద ఈరోజు వెన్నుపోటుకు 2 సంవత్సరాలు కార్యక్రమం...



రాజమండ్రి రూరల్, (తెలుగు గళం) జూన్ :12 రెండేళ్ల పాలనపై విజయోత్సవాలు చేసుకుంటున్న కూటమి ప్రభుత్వాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్. రాజమండ్రి కోటిపల్లి బస్టాండ్ జంక్షన్ లో జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆధ్వర్యంలో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూరల్ నియోజకవర్గ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుష్క వాగ్దానాలు తప్ప, శూన్యం తప్ప కూటమి చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా బూటకపు హామీలతో డైవర్షన్ పాలిటిక్స్ తో నెట్టుకొస్తున్న ఈ ప్రభుత్వం గుట్టు రట్టు అయిందన్నారు.కూటమి ప్రభుత్వ డొల్లతనాన్ని ప్రజలు గుర్తించారని,అందుకే వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం పేరిట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుకు విశేష స్పందన లభించిందని వేణు చెప్పారు...

# శేరిలింగంపల్లిలో వరద ముప్పుపై అప్రమత్తం



శేరిలింగంపల్లి (తెలుగు గళం) : వర్షాకాలం నేపథ్యంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వాటర్ లాగింగ్ పాయింట్లు, మల్కాం చెరువును జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలలో ఉప కమిషనర్, ఇంజనీరింగ్, హైడ్రా, సాగునీటి శాఖ అధికారులతో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు.

ఈ సందర్భంగా అధికారులు ప్రస్తుత పరిస్థితులు, డ్రైనేజీ ప్రవాహ మార్గాలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరంపై చర్చించారు. వాటర్ లాగింగ్‌కు గురయ్యే ప్రాంతాల్లో తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ వరద ఉపశమన చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

మల్కాం చెరువు పరిసర ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు.

# వెన్నుపోటు కి రెండేళ్లు.. అంబటి రాంబాబు



గుంటూరు (తెలుగు గళం): ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైఎస్ఆర్సిపి గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని లాడ్జి సెంటర్లో డీఎస్సీ దిష్టిబొమ్మను పోలీసులు అడ్డుకోగా టిడిపి మేనిఫెస్టోను కాల్చి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏసురత్నం,మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటుకు 2 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. సూపర్ సిక్స్ లో భాగంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ ను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు.

సూపర్ సిక్స్ పథకంలో ముఖ్యంగా స్త్రీ నిధి పథకం 1500 రూపాయలు ఇస్తానని స్త్రీలను మోసం చేశారని విమర్శించారు.

నారా లోకేష్ యువగళం యాత్రలో నిరుద్యోగులకి ప్రతినెల 3వేలు రూపాయలు ఇస్తామని దగా చేశారని దుయ్యబట్టారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ మహిళలకు 50 సంవత్సరాలు నిండితే ఫెన్షన్ ఇస్తామని మహిళలను వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. మహిళల అక్రమ రవాణా జరిగిందని గొంతు చించుకున్న పవన్ కళ్యాణ్ నోరు ఎందుకు మెదపటం లేదని ప్రశ్నించారు.

# షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం.. ఇల్లు, నగదు, సామగ్రి బూడిద



భీమిలి తెలుగు గళం న్యూస్ భీమునిపట్నం మండలం రెవిడి పంచాయతీ రౌతుల పాలెం గ్రామం దగ్గరలో ఉన్న పతివాడ కల్లాలు లో రాత్రి 11 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది ఈ ప్రమాదంలో పతివాడ పైడ్రాజు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది ఊరికి కొంచెం దూరం ఉండటం వల్ల అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు స్థానికులు నిద్రమత్తులో ఉండటం వల్ల మంటలను అదుపుచేయలేక పోయారు ప్రమాదం జరిగిన చోట ఎవరూ లేకపోవడం దీనికి ముఖ్య కారణం అని స్థానికులు చెపుతున్నారు ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిందని ఈ ప్రమాదంలో ఇంటి యజమాని పతివాడ పైడ్రాజు దాచుకున్న సుమారు 40 వేల రూపాయలు మరియు సామాగ్రి 15 నాటు పుంజులు కాళీ బూడిదయ్యాయి విషయం తెలుసుకున్న స్థానికులు నాయకులు సంఘటన స్థలానికి చేరుకునే బాధితుడికి పరామర్శించి నష్టపరిహారాన్ని సుమారు రెండు లక్షల రూపాయల పరిహారాన్ని ప్రభుత్వానికి తెలియజేసి నష్ట పరిహారాన్ని బాధితుడు కుటుంబానికి అందజేస్తామని తెలియజేశారు.

## నేడు సత్తుపల్లిలో కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

### నూతన మండల, పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం



సత్తుపల్లి,ఆర్ సి,జూన్12 (తెలుగుగళం) న్యూస్ : కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. పట్టణంలోని సిద్ధారం రోడ్డులో ఉన్న ఎంఆర్ గార్డెన్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నాయకత్వం వహించనున్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలకు చెందిన గ్రామ, పట్టణ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సమావేశం అనంతరం ఐదు మండలాల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో పాటు కల్లూరు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా, మండల, గ్రామ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోరింది.

## గ్రామ పంచాయతీ వర్కర్స్ కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలి: సిఐటియు డిమాండ్"




ఖమ్మం,కలెక్టరేట్,జూన్12(తెలుగు గళం) న్యూస్:గ్రామ పంచాయతీ వర్కర్స్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముందు జరిగిన ధర్నా లో పాల్గోన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ కు మేనిఫెస్టో ప్రకటించిన విధంగా మొత్తం సిబ్బంది ని, పర్మినెంట్ చేయాలని,కనీస వేతనం 26 000 ఇవ్వాలని, ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు గ్రీన్ చానల్ ద్వారా కార్మిక ఖాతాల్లో జమ చేయాలని, పంచాయతీ వర్కర్స్ కు రెండోవ పిఆర్సీ వర్తింప చేయాలని, మల్టిపర్పస్ విధానాన్ని రద్దుచేసి, కేటగిరీల వారీగా వర్కర్స్ నియమించాలని డిమాండ్ చేశారు.పంచాయితీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.డ్యూటీలో చనిపోయిన కార్మికులకు ప్రమాదం భీమా 20 లక్షలు ఇవ్వాలని, కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని , పది లక్షల రూపాయలు ఇన్సూరెన్స్, గ్రాడ్యూటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు, అక్కడ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు, అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీజ, కు,డిపిఓ రాంబాబు కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షులు వంగర ధర్మేంద్ర, జిల్లా నాయకులు పంగా లాలయ్య లక్ష్మి నారాయణ, నరేష్ ధనలక్ష్మి శ్రీనివాసరావు సత్యం ఆనందరావు పాప్య బ్రహ్మం క్రిష్ణ చరణ్ ఉపేంద్రమ్మ లచ్చయ్య సంగయ్య బాలనాగమ్మ మణి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి"




కల్లూరు, జూన్12(తెలుగు గళం) న్యూస్ : రాష్ట్రంలోని రేషన్ దుకాణాల ద్వారా కేరళ తరహాలో 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కల్లూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐద్వా సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో అందించే సరుకులను తగ్గించేందుకు బోగస్ రేషన్ కార్డుల పేరుతో ప్రభుత్వం సాకులు చెబుతోందని విమర్శించారు. పేద ప్రజలకు అవసరమైన అన్ని నిత్యావసర సరుకులు అందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

యుద్ధ పరిస్థితుల పేరుతో కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు మోపుతూ, ధనిక వర్గాలకు మాత్రం ప్రయోజనాలు కల్పిస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గృహజ్యోతి పథకం కింద ఏడాదికి 12 గ్యాస్ సిలిండర్లను పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.


అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయడంతో పాటు భూమిలేని వారికి భూమి పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌కు అందజేశారు.

ధర్నాలో ఐద్వా సత్తుపల్లి డివిజన్ అధ్యక్షురాలు రత్నకుమారి, డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, కల్లూరు మండల అధ్యక్షురాలు బిరవల్లి తిరుమల, కరిష్మా, పుష్పవల్లి, షేక్ జాన్‌బీ, షేక్ మౌలాబీ, కుర్రారపు రాజేశ్వరి, క్రాంతి, భూలక్ష్మి, మాణిక్యం, సుజాత, శకుంతల, మరియమ్మ, అగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సిబిఐ విచారణ జరిపించాలి

### దోషులెవరో తేల్చాలని అంతర్జాతీయ గాంధీ పతం మరియు భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి

### --- అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి




భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర తన అనుచరులతో నిరసన తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి గ గత 12 సంవత్సరాల నుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నరేంద్ర మోడీ జీ కి ఇది పెద్ద కలంకమనీ, శ్రీమతి మీనాక్షి నటరాజన్ పై తెలంగాణలో నమోదు కానీ కేసును ఆధారంగా తీసుకుని, కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన మహిళామణి శ్రీమతి మీనాక్షి నటరాజన్ ఎదుగుదలను ఓర్వలేక జరిగిన ఈ ద్రోహం మరియు కుట్ర మామూలు విషయం కాదని తీవ్రంగా తీసుకోవాల్సిన విషయం కాబట్టి సిబిఐ విచారణ జరిపించి, ఈ కుట్రకు పాల్పడ్డ దోషులు ఎవరో నిగ్గు తేల్చి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని డా.భూసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు

ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ గాంధీ పదం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ అధ్యక్షులు చింతలచెరువు గెర్సోము భద్రాచలం నియోజకవర్గం ప్రతినిధి గంజి సంపత్ జక్కం ప్రసాద్ మహిళలు స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## తాలిపేరు ఎడమ కాలువలో అడ్డంకులు తొలగించాలి..

### -- జిల్లా కలెక్టర్ అంకిత్



దుమ్ముగూడెం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ సాగునీటి సరఫరా నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వీరభద్రపురం గ్రామం పరిధిలోని తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాళిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాల భూమికి సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా సుమారు 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని,

ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అశోక్ కుమార్ ఇరిగేషన్ ఈ ఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'వెన్నుపోటుకు రెండేళ్లు.....

### తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో...

### భారీ మోటర్ సైకిల్ ర్యాలీ....



మండపేట(తెలుగు గళం)జూన్ :12

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి "బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ" అన్న నానుడిని చంద్రబాబు ప్రతిరోజూ తన వైఫల్యాలతో రుజువు చేస్తున్నారని విమర్శించారు మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు .. మండపేట రాజారత్న సెంటర్ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సూపర్‌సిక్స్‌తో సహా, మ్యానిఫెస్టో కాపీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు ఫొటోలతో సంతకాలు చేసి, ప్రతి ఇంటికి పంపించిన బాండ్ల కాపీలు చూపిస్తూ భారీ ర్యాలీ గా వచ్చారు.తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహించారు.

డీఎస్సీ--2025లో జరిగిన అక్రమాలు, అవకతవకలను ప్రస్తావిస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మెయిన్ రోడ్, కరాచీ సెంటర్, కలువపువ్వు సెంటర్, కేపీ రోడ్డు, రథం సెంటర్, రావి చెట్టు జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం కు చేరుకున్నారు. అక్కడ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు .గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ డీఎస్సీలో నియమాలు ఇష్టానుసారం మార్చి, కొత్తగా జీఓలు జారీ చేసి, స్పోర్ట్స్ కోటా పోస్టులు అడ్డగోలుగా భర్తీ చేసినట్లు ఆరోపణలు చేశారు. దీంతో అన్యాయానికి గురైన డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన చెందుతుండగా డీఎస్సీ--2025పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనను పూర్తిగా పక్కనబెట్టి, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ రాష్ట్రాన్ని ఒక 'జంగిల్ రాజ్'గా మార్చేశారని ఆయన మండిపడ్డారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు పలానా మంచి చేశానని ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఏ కోశానా లేదని, ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తే అత్యంత ఘోరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎల్లో గ్యాంగ్‌తో కలిసి వైసీపీని ఒక భూతంలా చూపే కుట్రపూరిత ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అమరావతికి ప్రత్యామ్నాయంగా తాము అత్యంత ప్రాక్టికల్‌గా ఉండే 'మావిగన్' ప్రాంతాన్ని జగన్ రాజధాని కారిడార్‌గా ప్రతిపాదించారని వెల్లడించారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే పెట్రో ధరలు అధికమని, తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామని నాడు ప్రకటించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే ఆ పని చేయాలని డిమాండ్ చేశారు. నాడు పెట్రో ధరలు ప్రస్తావిస్తూ, నానా హంగామా చేసిన తండ్రీ కొడుకులు, ఇప్పుడు ఆనాటి మాదిరిగా పెట్రోల్ బంక్‌ల ముందు సెల్ఫీ దిగే దమ్ముందా? అని ఆయన సవాల్ చేశారని తెలిపారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు" భారీ నిరసన ర్యాలీ విజయవంతం



భీమిలి(తెలుగు గళం):- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా భీమిలి నియోజకవర్గం మధురవాడలోని మిధునాపురి ఉడా కాలనీ గాంధీ విగ్రహం వద్ద నుండి రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడింది.

ఈ కార్యక్రమం విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ ర్యాలీలో శ్రీమతి మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్ హాజరయ్యారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ అమలుకాక ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం, నిరుద్యోగ సమస్య, రైతులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు.

## వెన్నుపోటు పాలనకు రెండేళ్లు...

## ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీ

### వైయస్ఆర్సీపీ శ్రేణులతో కిక్కిరిసిన సైదాపురం

### వెంకటగిరి అడ్డా నేదురుమల్లి అడ్డా అంటు నినాదాలతో మార్మోగిన వైకాపా అభిమానులు

### వెంకటగిరి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నేనె పోటీచేస్తున్న-నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



నెల్లూరు జిల్లా సైదాపురం(తెలుగు గళం):-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వెన్నుపోటు పాలనకు రెండేళు కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండల కేంద్రంలో వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ప్రజలు భారీగా తరలివచ్చారు. ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీ జనసందోహంతో ర్యాలీ విజయవంతంగా సాగింది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని నాయకులు విమర్శించారు.అదేవిధంగా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నేనే బరిలో ఉంటానని మా అధిష్టానం క్లారిటీగా ఉందని ఎటువంటి సందేహాలు అవసరం లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దండొలు లక్ష్మీ నారాయణరెడ్డి, సైదాపురం మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్, యోగి,చిట్టెటి హరికృష్ణ, వెందోటి కార్తీక్ రెడ్డి, శ్రీనివాసరాజు, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.